# గుంటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లలితా హాస్పిటల్ ప్రారంభోత్సవం...





గుంటూరు, పెన్ పవర్, జూన్, 03, దశాబ్దాలుగా వైద్యం రంగంలో లలితా గ్రూప్ ఉంది. గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరం. సౌత్ ఇండియాలోనే మొదటి సారి ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్ ఇక్కడికి తీసుకొచ్చారు. 1995లో నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు, ఇతర చిన్న ఆసుపత్రులు హైదరాబాద్‌లో ఉండేవి. నాడు హైదరాబాద్ లో హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశాం. దేశంలో ఎక్కడి నుంచైనా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ట్రీట్మెంట్ చేయించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లోని రోగులు అమరావతి వచ్చి ట్రీట్మెంట్ చేయించుకుంటారు 15 లక్షల పేషెంట్లకు ఈ ఆసుపత్రి ట్రీట్మెంట్ ఇచ్చింది. బ్రాండ్ ఎస్టిబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనం విలువలు లేకపోతే లాజికల్ గా తీసుకెళ్లలేం. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి.. అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ. ఏడు ఎకరాల్లో 600 పడకలతో ఈ లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలిజీ, న్యూరీలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ ఇనిస్టిట్యూట్ గా లలితా ఆసుపత్రి మారుతుంది. మనిషికి ఆరోగ్యానికి మించి ఆస్తి ఉండదు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే నిజమైన ధనవంతుడు వేల కోట్లు ఉన్నా, ప్యాలెస్ లు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. హెల్తీ సిటిజన్సే వెల్తీ నేషన్ నిర్మిస్తారు మేం సంజీవని ప్రాజెక్టు తీసుకొచ్చాం. ఇది కంప్లీట్ హెల్త్ కేర్ ప్రోగ్రాం. మంత్రి కూడా ప్రజలకు మెరుగైన వైద్యం కోసం పని చేస్తున్నారు. డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తున్నాం. ప్రపంచంలోని నాలెడ్జ్ ను, బెస్ట్ ప్రాక్టీస్ తీసుకొచ్చి మీ ఇంటిదగ్గరే అందించేలా సంజీవని పని చేస్తుంది. ప్రిడెక్టివ్, ప్రెవెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఏ మందులు వేసుకోవాలి, ఎప్పుడు ఆసుపత్రులకు రావాలో సంజీవని ద్వారా చెప్తారు. యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొచ్చాం. రూ.2.5 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తాం. ప్రజలు ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి తెచ్చుకోవద్దు. తినే తిండి, మన పరిసరాలు, మన ఆలోచనా విధానం చాలా ముఖ్యం. ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు తెచ్చినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు మద్దతు లేకుంటే సాధ్యం కాదు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి పనికొస్తాయి. యోగాకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రాణాయామంకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం. ఫుడ్ మెడిసిన్...కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుంది. ఒకప్పుడు కావాల్సిన పంటలు ఎరువులు లేకుండా పండించారు. కానీ ఈ రోజు మొత్తం యూరియా వాడుతున్న ఆహారం తీసుకుంటున్నాం. తెలిసీ తెలియక ఎక్కువగా క్రిమీ సంహారక మందులు వాడుతున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ప్రజల జీవితాలతో చెలగాటమాడారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# ఈ నెల 5 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు సన్నద్ధత...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..



విజయవాడ, పెన్ పవర్, జూన్, 03, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు దోష రహిత ఓటర్ల జాబితా కీలకమని.. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సన్నద్ధత కార్యకలాపాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజిన్ (ఎస్ఐఆర్)-2026పై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఏపీ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీసీకి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, ఎన్నికల విభాగం అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జరగాల్సిన సర్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్వోల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతుందని.. జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ల స్వీకరణ ఉంటుందని.. ఆ తర్వాత వీటిని పరిష్కరించి ఈ ఏడాది సెప్టెంబర్ 22న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈసీఐ మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ ప్రతి దశలోనూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

అధికారులు, సిబ్బందికి శిక్షణ, రాజకీయ పార్టీలతో సమావేశాలు, ఎన్యూమరేషన్ ఫారాల (ఈఎఫ్) జనరేషన్, ప్రింటింగ్, ఈఎఫ్‌ల అందజేత, స్వీకరణ ఇలా ప్రతి అంశంపైనా స్పష్టతతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ సమన్వయ విభాగం అధికారి అనుష్ కుమార్, ఎలక్షన్ డీటీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు..

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత...కమిషనర్ మయూర్ అశోక్..






గుంటూరు, పెన్ పవర్, జూన్, 03,పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ అన్నారు. జూన్ 5 పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోల్యూషణ్ కంట్రోల్ బోర్డు మరియు హార్ట్ ఫుల్ సెంటర్ వారి ఆధ్వర్యంలో పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ నుండి తారకరామ నగర్ వరకు ప్రజల అవగాహన కొరకు ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని నగర కమిషనర్ జెండా ఊపి ప్రారంభించి, ప్రజలు విధ్యార్థులతో కలిసి సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ ఎమిషన్స్ (కర్బన వాయువులు) అధికమౌతున్న నేటి తరుణంలో భవిష్యత్ ను కాపాడుకోవాలంటే మనం పర్యావరణ అనుకూలమైన సైకిల్ వాడకాన్ని ప్రజా రవాణా వ్యవస్థగా మేరుగుపరచుకోవాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రజలు ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణానికి అనుకూలమైన అలవాట్లను అలవరచుకోవాలని తెలిపారు. సైకిల్ వినియోగం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని, ఇంధన వినియోగం తగ్గి వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనేక దేశాల్లో సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నారని, అదే దిశగా గుంటూరు నగరంలో కూడా సైక్లింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేయడానికి ఆలోచనలు చేస్తామన్నారు. సదరు కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ సి. హెచ్ శ్రీనివాస్, పోల్యూషణ్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ నజీనా బేగం, హార్ట్ ఫుల్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ రామచంద్ర రావు, ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ తిరుపతి రెడ్డి, యన్.యస్.యస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ జే. సుదీర్, ఐ.టి.సి నారాయణ, యస్.యస్ సోమశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, విద్యార్థులు, సీనియర్ సిటిజెన్స్, ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయండి : ప్రత్తిపాటి

**ప్రజల సహకారం, ప్రత్యామ్నాయ వనరుల వినియోగంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం.**
**ఘన వ్యర్థాల సేకరణ, నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు పాలుపంచుకునేలా ప్రత్యేక విధివిధానాలు రూపొందించండి.**
**రోడ్లు, డ్రైనేజ్ లు, పార్కులు, ఆటస్థలాలు, శ్మశానవాటికలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోండి.**
**పట్టణాభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్తిపాటి సమీక్ష.**



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 3: చిలకలూరిపేట : పట్టణాభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలని, వారి ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి జరగాలని, అదేవిధంగా వ్యర్థాల సేకరణ, నిర్వహణ... పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంలోనూ వారి భాగస్వామ్యం ఉండేలా చూడాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణాభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. సమీక్ష అనంతరం ప్రత్తిపాటి పట్టణంలోని 38వ వార్డు, ఎన్టీఆర్ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని స్వయంగా పరిశీలించారు. చేసే అభివృద్ధితో ప్రజల్లో గుర్తింపు.. ప్రభుత్వ కృషికి సార్థకత లభించాలి పట్టణ సమగ్రాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందించే నిధుల్ని సద్వినియోగం చేసుకోవడంలో, ప్రజల అవసరాలు తీర్చడంలో అన్ని విభాగాలు పోటీపడాలని ప్రత్తిపాటి సూచించారు. నివాసాలున్న చోటే రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని, ప్రజలకు ఉపయోగపడితేనే అధికారుల కష్టం, ప్రభుత్వ కృషికి తగిన గుర్తింపు, సార్థకత లభిస్తాయన్నారు. రోడ్లు, డ్రైనేజ్ లు, పార్కులు, ఆటస్థలాలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. అన్ని మతాల శ్మశాన వాటికల ఆధునీకరణ పనులు వేగంగా నిర్దేశిత గడువులోపే పూర్తి కావాలన్నారు. తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలు పదేపదే పునరావృతం కావడానికి వీల్లేదని, ఆర్.డబ్ల్యూఎస్ విభాగం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందాలని, తదనుగుణంగా యంత్రాంగం నిబద్ధత, ముందుచూపుతో పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. రోడ్లపై, కాలువల్లో ఎక్కడా చెత్త కనిపించకూడదని, బాధ్యతరాహిత్యంగా వ్యవహరించే పౌరులు, దుకాణదారుల ఆలోచనల్లో మార్పు వచ్చేలా చూడాలన్నారు. 15వ ఆర్థిక సంఘం, మైనింగ్ గ్రాంట్ నిధులతో బాగా దెబ్బతిన్న రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోటే కొత్తవి నిర్మించాలని చెప్పారు. అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమీక్ష సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డిఇ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు, జంగా వినాయకరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 6 ఏళ్ల చిన్నారులకు ప్రత్యేక స్క్రీనింగ్.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, జూన్, 03, చిన్నారులకు ఆరోగ్యకరమైన మంచి భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో వారి సమగ్ర వికాసానికి నవ చేతన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని.. ఈ కార్యక్రమం విజయవంతానికి సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నవచేతన కార్యక్రమంపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ చిన్నారుల్లో ఎదుగుదల ఆలస్యాలు, వైకల్యతను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి తక్షణ సహాయక సేవలు అందించేందుకు ప్రభుత్వం నవచేతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని.. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత మొబైల్, డిజిటల్ టూల్స్ ద్వారా పిల్లల ఎదుగుదల స్థాయిని అంచనా వేయొచ్చన్నారు. చిన్నారుల శారీరక, మానసిక, భాషా, సామాజిక, స్వయం సహాయక నైపుణ్యాలను పరిశీలించి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. పిల్లల ప్రవర్తన, మాట, కదలికలు, సామాజిక నైపుణ్యాలను పరిశీలించి స్క్రీనింగ్ డేటాను యాప్‌లో నమోదు చేస్తారన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ అవసరమైన పిల్లలను వైద్య, ఇతర నిపుణుల వద్దకు రిఫర్ చేసి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమని.. మెదడు అభివృద్ధిలో సుమారు 80 శాతం మూడేళ్లలోపు పూర్తవుతుందని వివరించారు. ఈ దశలో ప్రత్యేక దృష్టిసారించడం ద్వారా చిన్నారులకు భద్రమైన జీవితాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఎదుగుదల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సరైన చికిత్స, థెరపీ, ప్రత్యేక శిక్షణ అందించవచ్చని.. ఈ కార్యక్రమం విజయవంతానికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ తదితరాలు పరస్పర సహకారంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, డీఎంహెచ్‌వో డా. జె.ఇందుమతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శరత్, ఆర్బీఎస్కే పీవో డా. జి.మాధవి నాయుడు, సీడీపీవోలు భానుమతి, జ్యోత్స్న, లక్ష్మీ భార్గవి, సత్యవతి, పుష్పలత, కృష్ణ కుమారి, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# లలిత పీవీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' ఆసుపత్రిని ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రత్తిపాటి పుల్లారావు.



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 3: గుంటూరులో నూతనంగా నిర్మించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం అయిన లలిత పీవీఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కార్యక్రమంలో మాజీమంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని డాక్టర్ రాఘవ శర్మ ని సన్మానించి ఆసుపత్రి ను సందర్శించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గుంటూరు నగరంలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో, వైద్య సేవలకు కొత్త కేంద్రంగా 'లలితా పీవీఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' హాస్పిటల్ నిలిచిందన్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య మౌలిక సదుపాయాలు, ప్రపంచ స్థాయి వైద్య సేవలు మరియు సౌకర్యాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఇంతటి అత్యాధునిక హాస్పిటల్ ను గుంటూరు నగరం నందు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, ఇండియాలోనే మొట్టమొదటి అత్యాధునిక ఎమ్ఆర్ఐ స్కాన్ ఇక్కడికి తీసుకొచ్చారని,ఈ సందర్భంగా ఆయన నూతన ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గుంటూరు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఆయన కొనియాడారు.

# ల్యాండ్ పూలింగ్ వివరాలను సీఆర్డీఏకు అందించండి: జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సంజనా సింహ




నరసరావు పేట, పెన్ పవర్ జూన్ 03: అమరావతి మండలంలో ల్యాండ్ పూలింగ్ (భూసమీకరణ)కు అంగీకరించిన రైతుల వివరాలతో పాటు, దేవాదాయ, రెవెన్యూ శాఖల భూముల రికార్డులను త్వరితగతిన క్రోడీకరించి సీఆర్డీఏకు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సంజనా సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వి.సి. హాల్‌లో ల్యాండ్ పూలింగ్, భూముల వివరాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో మరియు త్వరితగతిన పరిహారం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇందుకోసం వివిధ శాఖల మధ్య సమాచార మార్పిడి సులభంగా, వేగంగా జరగాలని సూచించారు. సత్తెనపల్లి ఆర్డీవో శ్రీరాములు, అమరావతి మండల అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి వివరాలను అందజేయాలని కోరారు. ఈ పరిధిలో ఉన్న దేవాదాయ భూములు, రిజిస్టర్ అయిన మరియు కాని భూములు, జరీబ్ భూములు, చెరువులు, కాలవ పోరంబోకు తదితర భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేసి, స్పష్టమైన నివేదికను సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సత్తెనపల్లి ఆర్డీవో శ్రీరాములు, సి.ఆర్.డి.ఏ స్పెషల్ డిప్యూట్ కలెక్టర్ రమణాకాంత రెడ్డి, అమరావతి తహశీల్దార్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర ఓటర్ల జాబితా రూపకల్పన ప్రతి ఒక్కరి బాధ్యత...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...

విజయవాడ, పెన్ పవర్, జూన్, 03, భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తున్నామని.. ఈ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సర్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు సంబంధించి జిల్లాస్థాయిలో కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు శిక్షణతో పాటు సన్నద్ధత కార్యకలాపాలు ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పోలింగ్ బూత్ స్థాయి బీఎల్‌వోలకు అందజేసి ఈ నెల 15వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు సమాచారాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ల స్వీకరణ ఉంటుందని.. ఆ తర్వాత వీటిని పరిష్కరించి ఈ ఏడాది సెప్టెంబర్ 22న తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ)ను నియమించుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి



చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకర ఓటర్ల జాబితా కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితా లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జరుగుతున్న కృషికి రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,792 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. కొత్తగా 129 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, సీహెచ్ చిట్టిబాబు (తెదేపా), తరుణ్ కాకాని (భాజపా), జె.శ్రీనివాస్ (జనసేన), యార్లగడ్డ ఆంజనేయ రెడ్డి (వైఎస్‌ఆర్‌సీపీ), కె.పరమేశ్వరరావు (ఏఏపీ), రాంమోహన్‌రావు, టి.వెంకటేశ్వరరావు (బీఎస్‌పీ), డీవీ కృష్ణ (సీపీఐ-ఎం), కలెక్టరేట్ సమన్వయం విభాగం అధికారి అనుష్ కుమార్, ఎన్నికల డీటీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

# ఉచిత మెగా వైద్య-రక్తదాన శిబిరం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు




నరసరావుపేట, పెన్ పవర్ జూన్ 03: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నరసరావుపేట రీజియన్, పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నరసరావుపేట మండలం రాయపాడు గ్రామంలో ఉచిత మెగా వైద్య-రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరి రక్తంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు రక్తదానంపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ఎస్‌బీఐ నరసరావుపేట రీజియన్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. శిబిరంలో గ్రామస్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్‌బీఐ అధికారులు, రెడ్ క్రాస్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుడుకి చిరు సహాయం

కర్లపాలెం: (పెన్ పవర్) కర్లపాలెం రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి అన్నారు. కర్లపాలెం మండలం తిమ్మారెడ్డిపాలెం కు చెందిన శవనం శివ నాగేందర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయి గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడి కుటుంబ సభ్యులకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ వివిధ కారణాలతో అనేక రకాల ఇబ్బందులు పడుతున్న పేదలకు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అండగా



నిలుస్తున్నామని చెప్పారు. తిమ్మారెడ్డి పాలెం కు చెందిన శివ నాగేందర్ రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో బాధితుడికి హార్దిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరడంతో తమ సభ్యుల ఆదేశాలతో రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం అందజేసి కొంతమేర ధైర్యాన్ని నింపామని చెప్పారు. వివిధ సంఘాల దాతలు స్పందించి బాధితుడికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు బుగ్గవరపు శివకుమార్, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, ఇనపగోళ్ళ రంగారావు, పెద్దమలు శ్రీకాంత్, నరాలశెట్టి నాగరాజు,బండ్రెడ్డి అంకమ్మరావు,నందిపాటి శ్రీరామ సునీల్, కొత్త మల్లికార్జునరావు, విన్నకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పిఎమ్ స్వనిధి పథకం వీధి వ్యాపారుల ఆర్థిక ప్రగతికి సరికొత్త బాట.. కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్..

విజయవాడ, పెన్ పవర్, జూన్, 03, భారతదేశంలో పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. 2050 నాటికి దేశ జనాభాలో దాదాపు 50% మంది పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తారని అంచనా. ప్రస్తుతం, పట్టణ శ్రామిక శక్తిలో సుమారు 66% మంది అసంఘటిత రంగంలోనే పని చేస్తుండగా, వీరంతా పట్టణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్య స్తంభంగా నిలుస్తున్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న వారిలో వీధి వ్యాపారులది కీలక పాత్ర. పండ్లు, కూరగాయలు, టీ, చిరుతిళ్లు, దుస్తులు, ఇతర రోజువారీ వినియోగ వస్తువులను విక్రయించే కోట్ల మంది వీధి వ్యాపారులు పౌరుల జీవితాలను సులభతరం చేయడమే కాదు, పట్టణ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారాన్ని అందిస్తున్నారు. వీధి వ్యాపారులకు ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, అధికారిక బ్యాంకింగ్, రుణ సదుపాయాలు చాలా పరిమితంగానే ఉండేవి. ఎలాంటి రుణ చరిత్ర లేకపోవడంతో అధిక వడ్డీ రేట్లకు అనధికారిక ఆర్థిక వనరులపై ఆధారపడాల్సిన పరిస్థితి, దీంతో వారి ఆదాయంలో చాలా వరకు రుణాల చెల్లింపులకే ఖర్చయ్యేది. 2020లో వచ్చిన కోవిడ్-19 మహమ్మారి.. వీధి వ్యాపారులకు మరిన్ని సవాళ్లు విసిరి, వారి వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ ఇబ్బందులకు పరిష్కారంగా జూన్ 2020లో ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో “ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి( పిఎమ్ స్వనిధి) పథకాన్ని ప్రారంభించారు. భారతదేశంలో వీధి వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన మొట్టమొదటి సమగ్ర సూక్ష్మ-రుణ పథకమిది. ఇది వారికి మొదటిసారిగా అధికారిక ఆర్థిక రంగానికి సరళమైన, గౌరవప్రదమైన, సంస్థాగతమైన అవకాశాల్ని అందించింది. ఈ పథకం కింద, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎలాంటి హామీ లేకుండానే రూ.15,000, రూ.25,000 మరియు రూ.50,000 వరకు మూడు విడతల్లో మూలధన రుణాలను అందిస్తాయి. సకాలంలో రుణాలను తిరిగి చెల్లింపును ప్రోత్సహిస్తూ, గడువులోగా రుణాలు చెల్లించే లబ్ధిదారులకు 7% వడ్డీ రాయితీని ఈ పథకం అందిస్తుంది. గత ఆరేళ్లలో, పిఎమ్ స్వనిధి పథకం.. దాదాపు 76 లక్షల మంది వీధి వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చింది, దాని మూడు రుణ పద్ధతుల్లో రూ.17,800 కోట్లకు పైగా రుణాల పంపిణీని సులభతరం చేసింది. ఈ పథకం విజయం సాధించడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు, బ్యాంకింగ్ సంస్థల సమన్వయ ప్రయత్నాలను ఒకచోటకి చేర్చిన ప్రభుత్వ సమగ్ర విధానం. ఈ సంయుక్త భాగస్వామ్యం దేశవ్యాప్తంగా అపూర్వమైన విస్తరణను, అద్భుతమైన ఫలితాలను సాధించడానికి సహాయపడింది. ఈ పథకం కింద, లక్షలాది వీధి వ్యాపారుల బ్యాంక్ ఖాతాలు వాడుకలోకి వచ్చాయి, ఆర్థిక లావాదేవీలు రికార్డు కావడం ప్రారంభమయ్యాయి. మొదటిసారిగా వారి కోసం ఒక అధికారిక రుణ



చరిత్ర ఏర్పడింది. ఇది భవిష్యత్తులో పెద్ద మొత్తంలో రుణాలు, ఇతర ఆర్థిక సేవలను సులభంగా పొందడానికి మార్గం సుగమం చేసింది. ఈరోజు వీధి వ్యాపారులు గౌరవనీయ బ్యాంక్ వినియోగదారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. ఈ పథకంలోని మరో ముఖ్యాంశం డిజిటల్ సాధికారత. యూపీఐ, క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టారు. ఈ చొరవ ద్వారా, 55 లక్షల కంటే ఎక్కువ మంది వ్యాపారులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యారు. దీనివల్ల వారి లావాదేవీలు మరింత పారదర్శకంగా మారాయి, వారి ఆర్థిక విశ్వసనీయత బలపడింది. మహిళా సాధికారతకు కూడా ఈ పథకం గణనీయమైన సహకారాన్ని అందించింది. మొత్తం లబ్ధిదారులలో మహిళలు దాదాపు 46% మంది ఉన్నారు. ఫలితంగా, వారి ఆదాయ స్థాయిలు, సామాజిక హోదా, గృహ నిర్ణయాలలో భాగస్వామ్యం గణనీయంగా మెరుగుపడ్డాయి.

# జీతాలు చెల్లించండి.. పారిశుద్ధ్య కార్మికుల ఆకలి బాధని తీర్చండి

బాపట్ల: (పెన్ పవర్) బాపట్ల మండలంలోని సూర్యలంక సముద్రతీరం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించని వైనం ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి నెలకు వచ్చే ఎనిమిది వేలు జీతంతో ఇంటిని గడుపుతున్నామని మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో నాన్న అవస్థలు పడుతున్నామని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పర్యాటక కేంద్రంగా ఉన్న సూర్యలంక తీరం వద్ద ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి పరిశుభ్రత కల్పిస్తూ పర్యాటకులకు పరిశుభ్రమైన ప్రదేశాలను అందిస్తున్న మాకు జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు భారంగా మారిందంటున్న కార్మికులు మా



బాధను స్వయంగా పరిశీలించి మాకు జీతాలు చెల్లించాలని అధికారులను కోరుతున్నామన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శిని జీతాలు చెల్లించాలని కోరుతుంటే ఇస్తాం ఇస్తామంటూ నెలలు గడుపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు.

# తాగునీటి చెరువులు పరిశీలించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 3: చిలకలూరిపేట: ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే నిర్వహణ, సంరక్షణలో ఎక్కడా అలసత్వాన్ని సహించబోనని, సకాలంలో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు నిరంతం అందించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బుధవారం ఆయన పట్టణ శివార్లలోని 52 ఎకరాల టిడ్కో ప్రాంగణం సమీపంలోని పాత, కొత్త తాగునీటి చెరువుల్లో జరుగుతున్న వాటర్ పంపింగ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, ప్రజలకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన మంచినీరు అందించాలని, ఎప్పటికప్పుడు చెరువుల్లోని వ్యర్థాలు, పాచిని తొలగిస్తూ, క్లోరినేషన్ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వేసవి తర్వాత సకాలంలో వర్షాలు పడితే నీటి వినియోగం కొంత తగ్గుతుందని, అలా కాని పక్షంలో ఇప్పటిలానే అప్పుడుకూడా ప్రజలకు రెండుపూటలా తాగునీరు అందించాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు,



గట్టినేని విజయ్ సాయి, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత, యోగా, ధ్యానంతో జీవనవిధానంలో మార్పు : ప్రత్తిపాటి

## చిన్మయి మిషన్ -అమృత్ భారత్ యాత్రలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 3: చిలకలూరిపేట : మారుతున్న కాలంతో పాటు.. ప్రజల జీవన, ఆలోచనా విధానాలను మార్చే ముఖ్యమార్గాల్లో ఆధ్యాత్మికత, యోగా, ధ్యానంలే ప్రధాన పాత్ర పోషిస్తాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. చిన్మయి మిషన్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన మహారాష్ట్రలో ప్రారంభమైన అమృత్ భారత్ యాత్ర ఆధ్యాత్మిక ర్యాలీ బుధవారం చిలకలూరిపేట చేరుకున్న సందర్భంగా, పలువురు స్వామీజీలు, యోగులు, ఆధ్యాత్మిక వేత్తలకు ప్రత్తిపాటి సాదర స్వాగతం పలికారు. యాత్ర విశేషాలు, ప్రధాన ఉద్దేశం గురించి వారిని అడిగి తెలుసుకున్న అనంతరం ప్రత్తిపాటి ప్రసంగించారు.

ఆవేశం, దురాశ, అనాలోచిత



నిర్ణయాలే దు:ఖానికి కారణాలు

మానసిక ఆందోళన, ఒత్తిడి, శారీరక రుగ్మతలు, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం రక్షించకోవాలంటే ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలని, ఆధ్యాత్మిక ఆలోచనలు మనిషిని ప్రశాతంగా ఉంచుతాయని ప్రత్తిపాటి తెలిపారు. ఆవేశం, దురాశ, అనాలోచిత నిర్ణయాలే మనిషి దుఖానికి కారణాలన్నారు. మనసుని దైవానికి దగ్గర చేస్తేనే ప్రతి ఒక్కరి ప్రవర్తన, నడవడిక, మాటతీరులో మార్పు వస్తుందని ప్రత్తిపాటి చెప్పారు

# యడ్లపాడులో 'ఏఐ ఆధారిత సూపర్ నారి యాప్' పై వీఓఏలకు ఘనంగా శిక్షణ..

## ఆర్థిక పారదర్శకతకే పెద్దపీట: 'మన డబ్బులు - మన లెక్కలు'. డిజిటల్ బాటలో 1,336 పొదుపు సంఘాల మహిళలు బ్యాంక్ మేనేజర్లు,సెర్ప్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన..

చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూన్ 3: యడ్లపాడు: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక సాధికారత, పొదుపు సంఘాల నిర్వహణలో పూర్తి పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సంయుక్తంగా సరికొత్త సాంకేతికతకు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా, యడ్లపాడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, ఈ-నారి ప్రతినిధులకు 'ఏఐ ఆధారిత సూపర్ నారి యాప్' పై ఒక రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.మండల సమాఖ్య అధ్యక్షురాలి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సొంత ఫోన్లలోనే పొదుపు,అప్పుల లెక్కలు!..

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. "మన డబ్బులు - మన లెక్కలు" అనే ప్రధాన నినాదంతో ఈ సరికొత్త అప్లికేషన్‌ను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఇకపై పొదుపు సంఘాల మహిళలు తమ పొదుపు మొత్తాలు, చెల్లించిన అప్పులు, గ్రూపునకు వచ్చే లాభనష్టాల వివరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రతి సభ్యురాలూ గూగుల్ ప్లేస్టేర్ నుండి 'సూపర్ నారి యాప్'ను డౌన్‌లోడ్ చేసుకుని,తమ సొంత మొబైల్ ఫోన్ ద్వారానే వ్యక్తిగత ఖాతా వివరాలను ఎలా తనిఖీ చేసుకోవాలో ఈ సందర్భంగా క్షుణ్ణంగా వివరించారు.అలాగే సాంప్రదాయ పద్ధతిలో కాకుండా,డిజిటల్ విధానంలో గ్రూపు పుస్తకాలను పక్కాగా ఎలా నమోదు చేయాలో వీఓఏలకు ప్రాక్టికల్‌గా నేర్పించారు.

13,500 మంది మహిళలకు డిజిటల్ విప్లవం..

యడ్లపాడు మండల పరిధిలో విస్తరించి ఉన్న 1,336 పొదుపు సంఘాలకు చెందిన దాదాపు 13,500 మంది సభ్యురాళ్లకు ఈ సరికొత్త యాప్ ద్వారా నేరుగా లబ్ధి చేకూరనుంది. క్షేత్రస్థాయిలో ఈ సాంకేతికతను మహిళలకు చేరవేయడానికి గాను మండలంలోని ఈ-నారి ప్రతినిధులకు, సీఆర్‌పీ లకు ఈ ఒక రోజు శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని వెలుగు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ అవగాహన సదస్సులో సెర్ప్ అధికారులు, బ్యాంకింగ్ రంగ నిపుణులు, ఏపీఎం కె. రవీంద్రకుమార్, సీసీలు వై. పెద్దయ్య, సీహెచ్. నాగేశ్వరరావు, జి. నాగేశ్వరరావు, లీగల్ కోఆర్డినేటర్ ఎస్.కె. సైదావలి, మండల సమాఖ్య ప్రతినిధులు సెక్రటరీ శ్రీలక్ష్మి, హెచ్. ద్రాక్షాయమ్మ మరియు వివిధ గ్రామ సంఘాల వీఓఏలు,ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్, వారి ఫీల్డ్ ఆఫీసర్తో పాటు యూబీఐ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్లు విచ్చేసి మహిళల ఆర్థిక వృద్ధికి, డిజిటల్ బ్యాంకింగ్‌కు గల ప్రాధాన్యతను వివరించారు.



# ఆపరేషన్ క్లీన్ స్వీఫ్



బాపట్ల: (పెన్ పవర్ ) బాపట్ల జిల్లా కలెక్టర్ ఉ జిల్లా మేజిస్ట్రేట్ మరియు బాపట్ల పురపాలక సంఘ ప్రత్యేక అధికారి డా.వి.వినోద్ కుమార్, ఐఏఎస్ ఆదేశాల మేరకు, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ సూచనలతో బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ఉమ్మారెడ్డి సరోజినీదేవి కాలనీ మరియు వివేకానంద కాలనీలలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా బాపట్ల కమిషనర్ ఎం.చంద్ర మోహన్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది విస్తృత స్థాయిలో శుభ్రత పనులు చేపట్టారు. కాలనీలలోని ప్రధాన మరియు అంతర్గత రహదారులన్నింటిలో రోడ్ల ఊడ్చివేత, చెత్త తొలగింపు, డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెత్తను తొలగించే పనులు నిర్వహించారు డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రపరచి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా రోడ్ల పక్కన ఉన్న చెత్త కుప్పలు, ఖాళీ ప్రదేశాలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం. చంద్ర మోహన్ పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వార్డులో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వ్యవస్థను వినియోగించాలని సూచించారు. డ్రైనేజీలలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు వేయకుండా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ చేవూరి కరుణా,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల అప్రమత్తతకు పట్టణవాసుల ప్రశంసలు





పెడన, పెన్ పవర్ ప్రతినిధి, మే 3 పెడన పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెడన ఎస్సై-01 గంట్ల. సత్యనారాయణ, ఎస్సై-02 షేక్ బషీరేలు చేపడుతున్న రాత్రి గస్తీ కార్యక్రమంపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రాత్రివేళల్లో పోలీసు అధికారులు ప్రధాన కూడళ్లు, నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు మరియు సున్నిత ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తున్నారు.రాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించడంతో పాటు వాహనాల తనిఖీలు నిర్వహించడం ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో దొంగతనాలు, చోరీలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు పోలీసుల గస్తీ కారణంగా మరింత భద్రంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, అవసరమైన సూచనలు అందిస్తూ పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతున్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు: కూటమి వైఫల్యాలపై జూన్ 4 నుంచి నిరసనలు

## సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి విడదల రజిని విమర్శ



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 3: చిలకలూరిపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల పూర్తైన నేపథ్యంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు జూన్ 4 నుంచి చిలకలూరిపేట నియోజకవర్గంలోని మూడు మండల కేంద్రాలు, పట్టణంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం చిలకలూరిపేటలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో రూపొందించిన పోస్టర్, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాను యడ్లపాడు మండల కేంద్రంలో నిర్వహించే నిరసనలో పాల్గొంటానని వెల్లడించారు. అదేవిధంగా ఈ నెల 8న మహిళలు, యువత మరియు వివిధ వర్గాల ప్రజలతో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జూన్ 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాలు, సదస్సులు, ర్యాలీలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విడదల రజిని పిలుపునిచ్చారు.

# యు.జి.డి కి డి.పి.ఆర్ తయారు చేయాలి... జిల్లా కలెక్టర్ .యం.సాయి కాంత్..





గుంటూరు, పెన్ పవర్,జూన్, 03, గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను(యు.జి.డి) పక్కాగా ఏర్పాటు చేయుటకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డి.పి.ఆర్) తయారు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి సి.యం.సాయి కాంత్ వర్మ జిఎంసి అధికారులను ఆదేశించారు. గుంటూరు పట్టణంలో యు.జి.డి, నిరంతర నీటి సరఫరా, సుందరమైన కూడళ్లు, పార్క్‌హొఏర్పాటు, పి.వి.ఎన్ నాయుడు మార్కెట్ పునర్నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిఎంసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణానికి యు.జి.డి వ్యవస్థ పక్కాగా ఉండాలన్నారు. ఇందుకు ఇప్పటికే పూర్తి అయిన భాగంతో పాటు ఇంకా పూర్తి చేయాల్సిన భాగంపై స్పష్టమైన విశ్లేషణ చేసి డి.పి.ఆర్ లు తయారు చేయాలని సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలో జోన్లవారీగా ఎస్.టి.పి (సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) లను ఏర్పాటును కూడా ఇందులో చేర్చాలని అన్నారు. పి.వి.ఎన్ నాయుడు మార్కెట్ పునర్నిర్మాణ పనుల లాభదాయకతపై స్పష్టమైన విశ్లేషణ చేయాలని ఆదేశించారు. నిరంతర నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించాలి గుంటూరు పట్టణంలో ఉన్న అన్ని గృహాలకు నిరంతర నీటి సరఫరా అవకాశాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. నీటి సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, ఎక్కడా అతిసార వ్యాధి వంటి అంశాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

8 జంక్షన్ లు ఆధునీకరణ

పట్టణంలో 8 జంక్షన్ లు ఆధునీకరణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన మోడల్ లను పరిశీలించారు. హిందూ కాలేజీ కూడలి, బి.ఆర్ నాయుడు మార్కెట్ కూడలి, జిన్నా టవర్ జంక్షన్, కలెక్టర్ కార్యాలయం కూడలి, మూడు బొమ్మల జంక్షన్, చుట్టుగుంట జంక్షన్, మెడికల్ క్లబ్ జంక్షన్ ల సుందరీకరణకు అవసరమగు సూచనలు, సలహాలు ఇచ్చారు ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఏ.పి.యు.ఐ.ఏ.ఎం.ఎల్ ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు పత్రికా మిత్రులందరికీ హృదయపూర్వక ఆహ్వానం.




గుంటూరు, పెన్ పవర్, జూన్, 03, మీ ఆరోగ్య సంరక్షణ కోసం జూన్ 6వ తేదీ, 2026 శనివారం రోజున గుంటూరు అహల్య నర్సింగ్ హోమ్ నందు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.

సమయం: ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు.

ఈ శిబిరంలో బాడీ మాస్ ఇండెక్స్, ఎకో కార్డియోగ్రఫీ, ఈసీజీ, షుగర్ టెస్ట్ వంటి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిపుణులైన వైద్యులచే పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారు. శిబిరంలో పాల్గొనదలచిన వారు జూన్ 4 మరియు 5వ తేదీల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతి ఉన్నందున, ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాలకు ఫోన్ నంబర్లు నోట్ చేసుకోండి: 9246427459, 7013024815

అందరు పత్రికా మిత్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నాము. ఆ రోజున మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కలదు. ఇట్లు - సనెకాయల / వడ్లమూడి కుటుంబ సభ్యులు.

# వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ఆవిష్కరణ



పలమనేరు,పెన్ పవర్,జూన్ 03:పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ మరియు బుక్‌లెట్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి మరియు పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటేగౌడ ఆదేశాల మేరకు,జూన్ 4నుంచి 12వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని,అయితే రెండేళ్ల కాలంలో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీ ఇప్పటికీ అమలు కాలేదు.యువతకు నెలకు రూ.3,000 ఇస్తామన్న హామీని విస్మరించారు.అర్హులైన వారికి ఇప్పటి వరకూ కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని,వాలెంటీర్ వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక వ్యవస్థను నిర్వీర్యం చేశారని అన్నారు. ఉద్యోగులకు డీఏ పెంచుతామని హామీ ఇచ్చినా,ఇప్పటివరకు ఒక్క డీఏ కూడా అమలు చేయలేదని అన్నారు.బాండ్ల రూపంలో ఇంటింటికీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, వాటిలో ఏఒక్క ముఖ్యమైన హామీని కూడా నెరవేర్చలేదని నాయకులు ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ,కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు "వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు.ఇందులో పలమనేరు నాయకులు చెంగారెడ్డి, బాలాజీ నాయుడు, జాఫర్,హేమంత్,మురళి కృష్ణ,ప్రసాద్ రెడ్డి,గంగవరం నాయకులు చంద్రప్ప, ప్రహ్లాద,గిరిరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి వినియోగదారులపై పోలీసుల ఉక్కుపాదం

## ప్రత్యేక డ్రైవ్‌లో ఆరుగురు అదుపులోకి.. సరఫరా ముఠాలపై దర్యాప్తు ముమ్మరం



సూళ్లూరుపేట, పెన్ పవర్, జూన్ 3 తిరుపతి జిల్లా పోలీసు శాఖ గంజాయి నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పురోగతి సాధించింది. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో, సూళ్లూరుపేట సీఐ ఎం. మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గంజాయి సేవించిన ఆరుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుకొన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్న నేపథ్యంలో, అధునాతన (ఎం డి పి ఎస్) కిట్లను ఉపయోగించి అనుమానితులకు మూత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆరుగురు వ్యక్తులు గంజాయి సేవించినట్లు పాజిటివ్‌గా తేలడంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తులను విచారిస్తున్న అధికారులు, వారికి గంజాయి ఎక్కడి నుంచి అందుతోంది, ఎవరు సరఫరా చేస్తున్నారు, వారి వెనుక ఏదైనా ముఠా పనిచేస్తుందా అనే కోణాల్లో లోతైన దర్యాప్తు చేపట్టారు. గంజాయి సరఫరా ముఠా ను పూర్తిగా ఛేదించడమే లక్ష్యంగా బ్యాక్‌వర్డ్ ఫార్వర్డ్ లింకేజీలపై దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు మాట్లాడుతూ, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. గంజాయి అలవాటుకు బానిసైన వారు స్వచ్ఛందంగా మారి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే వారికి పోలీస్ శాఖ తరఫున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అలాగే కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి, సమాజంలో మంచి మార్పుకు ఆదర్శంగా నిలబెట్టే కార్యక్రమాలు కూడా చేపడతామని పేర్కొన్నారు. అయితే హెచ్చరికలను పట్టించుకోకుండా మళ్లీ మత్తు పదార్థాలు సేవిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ ప్రాంతాలతో పాటు పరిశ్రమల పరిసరాల్లో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉన్న ప్రజలు వెంటనే పోలీసులకు లేదా 112 నంబరుకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. గంజాయి రహిత సమాజం లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ మరింత దూకుడుగా చర్యలు కొనసాగిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్సై అజయ్ కుమార్, తడ ఎస్ఐ కొండపనాయుడు పాల్గొన్నారు.

# ఈ నెల 5 న వసతి గృహాలలో మొక్కలు నాటుటకు గుంతలు తీసే కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టాలి

**ఈ నెల 5 న జిల్లాలో ని వసతి గృహాలు నెట్ జీరో / హెల్తీ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి వసతి గృహంలో మొక్కలు నాటుటకు స్థలం కేటాయించాలి : జిల్లా కలెక్టరు డాక్టర్ వి.వినోద్ కుమార్, ఐ. ఏ.ఎస్.,**






బాపట్ల:(పెన్ పవర్) జూన్ 03: బాపట్ల జిల్లాలో ని అన్ని వసతిగృహాలను నెట్ జీరో ఒ హెల్తీ క్యాంపస్‌లుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నెట్ జీరో / హెల్తీ క్యాంపస్‌ల కార్యక్రమ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన డ్వామా పి డి, డి ఆర్ డి ఎ ప్రోజెక్టు అధికారి, స్థానిక మునిసిపల్ కమిషనరు, జిల్లా పరిషత్ సిఇఒ, జిల్లా పంచాయతీ అధికారి, గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండెంటు ఇంజనీరు, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా వెనుకబడినతరగతుల సంక్షేమ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మరియు నెడ్కాప్ ప్రోజెక్టు డైరెక్టరు సభ్యులుగా గల కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ని అన్ని వసతిగృహాలను నెట్ జీరో ఒ హెల్తీ క్యాంపస్‌లుగా ఏర్పాటు చేయుటకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. ఈ నెల 5 న జిల్లాలోని అన్ని రకాల వసతి గృహాల నందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహాలకు సంబంధించి డేటా అప్ లోడ్ చేయాలని యం పి డి ఓ లు ఏ పి ఓ పను ఆదేశించారు. ఈ నెల 5 న వసతి గృహాలలో చదువుతున్న పిల్లలు వారి తల్లిదండ్రులు అందరూ హాజరు అయ్యేట్లు చూడాలని ఆదేశించారు. అన్ని ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు మరియు వసతి గృహాలను నెట్ జీరో / హెల్తీ క్యాంపస్‌లుగా( ఎన్ జెడ్ హెచ్ స్) మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వసతిగృహాలను కర్బన ఉద్గార రహిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దుటకు ఏడు అంశాలతో కూడిన కార్యక్రమం అమలు చేయాలని తెలిపారు. ముందుగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించుటకు ప్రతి వసతి గృహంలో స్థలాన్ని ఎంపిక చేయాలన్నారు. మొక్కలు నాటుటకు జూన్ 5వ తేదీన శుక్రవారం గుంతలు తీసే కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టాలని ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, తల్లిదండ్రులను, గ్రామస్తులను, స్వచ్ఛంధ సంస్థలను భాగస్వాములను చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమం ఏడు అంశాలలో భాగంగా పచ్చదనం పెంపొందించడంతో పాటు, ప్రతి వసతిగృహంలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్లు మరియు సిస్టమ్‌లను ఏర్పాటు చేయాలని, నెట్ మీటరింగ్ సౌకర్యాన్ని సంబంధిత డిస్కామ్‌లకు ఏర్పాటు చేసి, విద్యుత్ వినియోగం సున్నా స్థాయికి తీసుకురావాలని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటు చేపట్టాలని, కంపోస్టు తయారీ యూనిట్ఏర్పాటుచేయాలన్నారు.వసతిగృహ అవసరాలకు కిచెక్ గార్డెన్ రూపొందించాలని, అదేవిధంగా మురుగునీటి శుద్ధి ప్రక్రియను చేపట్టి ఆ నీటిని మొక్కలు పెంచుటకు వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా వర్షపునీటిని ప్రతి నీటిబొట్టును భూమిలోకి ఇంకేవిధంగా ఇంకుడుగుంతలను నిర్మించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభతలో భాగంగా ప్రతి వసతిగృహంలో ముస్తాబు కార్యక్రమాన్ని తప్పని సరిగా అమలు చేయాలని జిల్లాకలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పి డి విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డి డి సత్యనారాయణ బి సి,ఎస్ టి, వసతి గృహాల అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# కోటప్పకొండలో దిగ్విజయంగా చిన్మయారణ్య స్వామీజీ పర్యటన

**500 మంది మహిళల ఊరేగింపు**
**పాదుకా పూజ, అనుగ్రహ భాషణం**
**ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**





నరసరావుపేట, పెన్ పవర్ జూన్ 03: ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు చిన్మయానంద మహారాజ్ స్వామీజీ బుధవారం సాయంత్రం కోటప్పకొండ చిన్మయారణ్య ఆశ్రమానికి విచ్చేశారు. స్వామీజీ రాకతో కోటప్పకొండ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. యూటీ జంక్షన్ నుంచి కోటప్పకొండ వరకు భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేధా దక్షిణామూర్తిని దర్శించుకొని కోటప్పకొండ సర్కిల్‌లోని శివుని విగ్రహం వద్ద నుంచి సుమారు 500 మంది మహిళలు సంప్రదాయ వస్త్రాలతో ఊరేగింపుగా ఆశ్రమానికి చేరుకున్నారు. ఆశ్రమంలో స్వామీజీకి పాదుకా పూజ నిర్వహించారు. అనంతరం స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ ఆశ్రమంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు మహిళలు, చిన్నారులు కోలాటం, సాంస్కృతిక కళలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రథోత్సవం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తుల సౌకర్యార్థం నరసరావుపేట పట్టణంలోని సత్తనపల్లి రోడ్డులోని విజయ్ కుమార్ కళ్యాణ మండపం వద్ద నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెరుమాళ్ళ సత్యనారాయణ, ఎస్ఎస్ఎన్ కాలేజీ ఉ పాధ్యక్షులు బత్తుల మురళి, శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం చైర్మన్ తాళ్లూరి సత్యనారాయణ, పసుమర్తి శివ నాగేశ్వరరావు, అనుమోలు శ్రీనివాసరావు, కూకుట్ల జగదీష్, కేమెల్ ప్రసాద్, కాకుమాను శ్రీనివాసరావు, బొగ్గరపు మణిదీప్, అప్పారావు తదితరులు కార్యక్రమ నిర్వాహణను విజయవంతం చేశారు.

# నెల్లూరు జిల్లా కావలి గౌరవరం వద్ద ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం




కావలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) జూన్:3 రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను అభినందించిన మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి -- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కావలి పట్టణంలోని ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ మరోసారి అద్భుత ఫలితాలతో విద్యారంగంలో తన ప్రత్యేకతను చాటుకుంది. 2026 సీబీఎస్ఈ ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి ఫలితాలలో విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరచడంతో పాఠశాల ప్రాంగణంలో ఘన అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి సత్కరించారు. 2026 సీబీఎస్ఈ ఇంటర్మీడియట్ ఫలితాలలో ఆర్ఎస్ఆర్ విద్యార్థిని బత్తిన రమ్యశ్రీ 500 మార్కులకు గాను 490 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకోవడం విశేషం. అలాగే పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ ఫలితాలలో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ గుర్తింపు పొందారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరైన 28 మంది విద్యార్థుల్లో 27 మంది డిస్టింక్షన్ సాధించగా, పాఠశాల 100 శాతం ఫస్ట్ క్లాస్ ఫలితాలు నమోదు చేసి మరోసారి తన విద్యా ప్రమాణాలను నిరూపించుకుంది. విద్యార్థుల ఈ విజయాలు పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం కృషికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. సభలో మాట్లాడిన కాకాని గోవర్ధన్ రెడ్డి విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆర్ఎస్ఆర్ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని, నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ వసతులు అందిస్తున్నామని తెలిపారు. అన్నదాత మనీ మాట్లాడుతూ ఉన్నత విలువలతో ఆర్ఎస్ఆర్ విద్యాసంస్థలు స్థాపించిన ప్రతాప్ కుమార్ రెడ్డి అభినందనలు పేద మధ్యతరగతి వారికి విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాంతంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్న ప్రతాప్ కుమార్ రెడ్డితో పాటు టీచింగ్ నాన్స్ టీచింగ్ స్టాఫ్ కి అభినందనలు తెలిపారు

ఈ కార్యక్రమంలో స్కూల్ ఏవో రేమాల రమణారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయాలపై ఆనందం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, "ఆర్ఎస్ఆర్ విద్యాసంస్థలో నాణ్యమైన బోధన, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, అత్యుత్తమ వసతులు ఉండటంతోనే మా పిల్లలు రాష్ట్ర స్థాయిలో రాణించగలిగారు" అంటూ యాజమాన్యం మరియు ఉపాధ్యాయులను అభినందించారు. ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ సాధించిన ఈ అద్భుత విజయాలు కావలి ప్రాంతానికే గర్వకారణంగా నిలుస్తూ, విద్యా రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నాయని పలువురు పేర్కొన్నారు.

# కావలి వెంగళరావు నగర్‌లో 22A తొలగింపు తర్వాతా రిజిస్ట్రేషన్లలో జాప్యం..? పేదలకు ఇబ్బందులేనా...

కావాలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) జూన్:3 నెల్లూరు జిల్లా కావలి వెంగళరావు నగర్‌కు సంబంధించిన 22A జాబితాలో తొలగించిన సర్వే నెంబర్లు, ప్లాట్ నెంబర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేదలకు ఊరట కలిగించిందని స్థానికులు అనుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్‌కు నోచుకోని ప్లాట్లు, గృహాలకు ప్రభుత్వం మార్గం సుగమం చేసిందని ప్రజల్లో చర్చ జరుగుతుంది.

అయితే, ప్రభుత్వం చొరవతో 22A జాబితా నుంచి తొలగించిన భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం పేద ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే అక్కడి అధికారులు రెవెన్యూ శాఖను సంప్రదించాలని చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు రెవెన్యూ అధికారులను అడిగితే "రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం" అంటూ హామీలు ఇస్తున్నప్పటికీ, పని మాత్రం ముందుకు సాగడం లేదని ప్రజలు వాపోతున్నట్లు సమాచారం. పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని 22ఏ నుంచి సర్వే నెంబర్లు తొలగించి రిజిస్ట్రేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, క్షేత్ర స్థాయిలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పేదలను కార్యాలయాల చుట్టూ తిప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అనుకుంటున్నారు. ప్రభుత్వం ఒక వైపు పేదలకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తుంటే, అధికారులు మాత్రం జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారా..?" అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, వెంగళరావు నగర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పేదలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నట్లు సమాచారం.

# లోక్ అదాలత్ పై అవగాహన పెంచుకోవాలి లోక్ అదాలత్ సభ్యులు . ఎం. మాలకొండ రెడ్డి



కావలి పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) జూన్:3 లోక అదాలత్ పై అవగాహన పెంచుకొని కక్షలు కార్పన్యాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని లోకఅదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి తెలిపినారు. కోర్టుకు రాని కేసులు పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేని అప్పిల్ లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్ లో ఇవ్వటం జరుగుతుందని తెలిపినారు. అలాగే కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కావలి లో జరుగు లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. లోక్ అదాలత్ లో నిరుపేదలకు, ఎస్సీ ఎస్టీ లకు ఉచిత న్యాయ సహాయము న్యాయ సలహాలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపినారు. కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు, మండలాల నుండి కక్షిదారులు సత్వర న్యాయం కొరకు ఈ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలని ఆయన తెలిపినారు

# "ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు- పూజిత"





కావలి పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) జూన్:3 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వెంకటాచలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, సర్వేపల్లి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో కలిసి "వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను,బుక్ లేట్ ను ఆవిష్కరించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత పూజిత కు ఆత్మీయ స్వాగతం పలికి,శాలువాలతో సత్కరించిన స్థానిక నేతలు, మహిళలు,

–పూజిత మాట్లాడుతూ

– గత రెండేళ్లుగా చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిన మోసాలను, వెన్నుపోటు రాజకీయాలను మాటల్లో చెబితే చాలదని, వాటన్నింటినీ ప్రజల ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ పుస్తకాన్ని రూపకల్పన చేసాం

– ఈ పుస్తకంలో 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన తాజా హామీలు, వాటి ఉల్లంఘనలు మరియు ప్రజలకు చేసిన వెన్నుపోటు అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచాం

– సాధారణంగా ఏ ముఖ్యమంత్రి అయినా వంద హామీలు ఇస్తే అందులో కనీసం 20 శాతం (20 హామీలైనా) నెరవేర్చడానికి ప్రయత్నిస్తారు, కానీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం కనీసం ఒక్క శాతం కూడా హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదు

– చంద్రబాబు హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను టిడిపి ప్రభుత్వం పూర్తిగా వంచించి, నట్టేట ముంచింది

– కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మహిళలకు పంగనామాలు పెడుతూ.. 'స్త్రీ శక్తి', గ్యాస్ సిలిండర్లు, 'దీపం' పథకం, పెన్షన్లు, తల్లికి వందనం అంటూ ఎన్నో రకాల అబద్ధపు హామీలు ఇచ్చింది

– అధికారంలోకి వచ్చాక నేడు మహిళలు, నిరుద్యోగుల పరిస్థితి, దయనీయంగా మారింది

– రాష్ట్రంలో ఒకపక్క మహిళలు, మరోపక్క రైతులు ఏడుస్తున్నారు.. కనీసం రైతులకు యూరియా కూడా దొరికే పరిస్థితి లేదు

– రైతులు బ్లాక్ మార్కెట్ లో యూరియా కొనుగోలు చేసి పంటలు పండించుకునే దుస్థితి కూటమి ప్రభుత్వంలో ఏర్పడింది

– చంద్రబాబు ప్రభుత్వం రైతులను నిరుద్యోగులను, యువతను ఘోరంగా వంచించింది

– మెగా డిఎస్సీ పేరుతో రకరకాల జీవోలను విడుదల చేసిన తీరు చూస్తుంటే, చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి,ఒక జీవో ఇవ్వడం, దాన్ని దాచడానికి ప్రయత్నించడం, మళ్లీ మరో జీవో తేవడం చూస్తుంటే నవ్వొస్తోంది

– కూటమి ప్రభుత్వం కేవలం తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ప్రయత్నిస్తోందే తప్ప, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు

– నిరుద్యోగులకు ఉద్యోగాలంటూ, మహిళలకు అధ్యాపక ఉద్యోగాలంటూ నమ్మించి నిరాశకు గురిచేశారు

– చంద్రబాబు ప్రభుత్వం రకరకాల మోసాలు చేస్తూ, రోజు కల్లబొల్లి కబుర్లు చెబుతోందే తప్ప ,ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదు

– జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాల వ్యవస్థ తీసుకువచ్చి, ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు

– రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు పుష్కలంగా పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు అందజేశారు

– ప్రజలకు పని చేసే పనిచేసే నాయకుడు ఎవరో మాటలు చెప్పే, నాయకుడు ఎవరు అర్థం అయిపోయింది

– చంద్రబాబు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు

– చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీల బాండ్ పేపర్లు, కాగితాలు కేవలం చలిమంటలు వేసుకోవడానికి తప్ప దేనికీ పనికిరావని ప్రజలకు అర్థమైంది

– ప్రజలకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుందామన్నా, అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో , ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం అవుతుంది

– రేపు 4వ తేదీన ప్రతి మండలంలో "వెన్నుపోటుకు రెండు సంవత్సరాలు" నిరసన కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టాం

– ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న వ్యతిరేకతను, ఆక్రోశాన్ని తెలియజేయడానికి వైఎస్సార్సీపీ ఒక వేదికను కల్పిస్తోంది

– ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ నిరసనను పూర్తి స్థాయిలో తెలియజేస్తారనే నమ్మకం ఉంది

– వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు విజయవంతం చేస్తూ వస్తున్నారు, ఈ కార్యక్రమానికి కూడా అదే స్థాయి విజయవంతంగా పూర్తి చేస్తారని నమ్మకం ఉంది

– ఈ సమావేశానికి విచ్చేసిన వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, మాకుటుంబ సభ్యులు లాంటి సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా

# ఎపి రాష్ట్ర క్యాడెట్ జూడో ఛాంపియన్‌షిప్ లో విజయనగరం కుర్రాడి ప్రతిభ

విజయనగరం టౌన్ పెన్ పవర్,జూన్ 3 "విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడెట్ (ఖ-17)జూడో ఛాంపియన్‌షిప్ -- 2026 లో విజయనగరం జిల్లా గురుదేవ్ జూడో అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారుడు "మొహమ్మద్ సిద్దిక్" విశిష్ట ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పంజాబ్‌లోని చండీగఢ్‌లో జూన్ 10 నుండి 13 వరకు జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ స్టేట్ క్యాడెట్ నేషనల్స్ పోటీలకు అర్హత సాధించాడు. క్రీడాకారుడిని గురుదేవ్ జూడో అసోసియేషన్ చైర్మన్ బి. చంద్రశేఖర్ రావు (రిటైర్డ్ పోలీస్ అధికారి), జనరల్ సెక్రటరీ ఒ కోచ్ రామకృష్ణ, పాల్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పప్పు విశ్వనాథ్, అలాగే గురుదేవ్ జూడో అసోసియేషన్ సభ్యులు అభినందించి, జాతీయ స్థాయిలోనూ అత్యుత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.